క్లుప్తంగా

6న పులిచెర్లలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్లలో ఈనెల 6వ తేదీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించనున్నారని ఎంపీపీ సురేంద్రనాథ్ రెడ్డి శనివారం తెలిపారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు ఆసరా చెక్కులను మంత్రి పంపిణీ చేస్తారని తెలిపారు. స్వయం సహాయక సంఘ సభ్యులు హాజరు కావాలని కోరారు.

పట్టుదలతో చదవాలి



విద్యా సామగ్రిని అందజేస్తున్న సలీం బాషా

రొంపిచెర్ల: రొంపిచెర్లలో 9,10 తరగతులు చదువుతున్న 60 మంది విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా శనివారం విద్యా సామాగ్రిని వితరణగా అందజేశారు. తన ఇంటి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టుదలతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని కోరారు. నాయకులు జాకీర్, అబూబక్కర్, గురు, మంజూర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ నూతన కార్యవర్గం

పలమనేరు: పలమనేరు న్యాయవాదుల సంఘం(బార్) నూతన కార్యవర్గ ఎంపిక శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జరిగింది. సంఘం అధ్యక్షుడిగా లక్ష్మీపతి, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా భర్కత్‌బీ, సంయుక్త కార్యదర్శిగా సంజయ్, కోశాధికారులుగా గుణశేఖర్, రాజారెడ్డి, లైబ్రేరియన్ కార్యదర్శిగా జగదీష్‌కుమార్, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యదర్శిగా రంజిత్‌షా, మహిళా ప్రతినిధిగా శ్రీనిజతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

స్పందన అర్జీలపై తక్షణం స్పందించాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ రవికుమార్

పులిచెర్ల(కల్లూరు): స్పందనలో వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని డీఎల్‌డీఓ రవి కుమార్ తెలిపారు. శనివారం ఆయన కల్లూరు-1, మతుకువారిపల్లె సచివాలయాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ సుగుణమ్మ, కల్లూరు ఈఓ యుగంధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ

పులిచెర్ల(కల్లూరు): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన కల్లూరు జగనన్న కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రతి ఇంటి ముందు లబ్ధిదారులు సోప్ పిట్స్ తవ్వుకోవాలని సూచించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీఓ సుగుణమ్మ, హౌసింగ్ ఏఈ త్యాగరాజ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చౌడేపల్లె: మండల పరిధిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చౌడేపల్లె, లద్దిగం, బోయకొండ, కాగతి, ఏ.కొత్తకోట, పరికిదొన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాల్లో మెయింటెన్స్ పనుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల సమయంలో నిరంతరం విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టామని, లోటుపాట్లను సరిచేసేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వినియోగదారులు దీన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

ఆలయంలో హుండీ చోరీ

బంగారుపాళెం: మండలంలోని పాలేరులో శుక్రవారం రాత్రి ఆంజనేయస్వామి గుడిలో దుండగులు హుండీ పగులగొట్టి అందులోని నగదు అపహరించుకుపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. పాలేరు-మోతకుంట రహదారి పక్కన ఆంజనేయస్వామి గుడిలో హుండీ ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి అందులో నగదు తస్కరించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని శనివారం ఉదయం గుర్తించి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారన్నారు.

మహిళాభ్యున్నతే జగనన్న లక్ష్యం

- బాబుపాలనలో కుప్పానికి ఒరిగిందేమీ లేదు
- కుప్పం అభివృద్ధికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉంది
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్సీ భరత్



మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: మహిళా అభ్యున్నతే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలో వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో భరత్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకంతో నెరవేర్చడం ద్వారా మహిళా ఆర్థికాభివృద్ధి సాధ్యమైందన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వమని తెలిపారు. మహిళాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, వారి ఖాతాల్లోనే లబ్ధి నగదు జమ చేస్తున్నారని పేర్కొన్నారు. కుప్పం మున్సిపల్ పరిధిలోని మహిళా సంఘాలకు రూ.9.89 కోట్ల లబ్ధి అందిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి జగనన్నను సీఎం చేస్తే మరిన్న పథకాలను ప్రవేశపెడుతారని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మెన్ సుధీర్, వైఎస్సార్ సీపీ నియోజక వర్గ పరిశీలకుడు రెడ్డప్ప, కౌన్సిల్ సభ్యులు, సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కుప్పంవాసులను పట్టించుకోని బాబు

చంద్రబాబు నాయుడు పాలనలో కుప్పానికి ఒరిగిందేమీ లేదని భరత్ తీవ్రంగా ఆరోపించారు. టీడీపీ నాయకులు కేవలం కమీషన్‌ల కోసం అభివృద్ధి కార్యక్రమాలను పేపర్‌లకు పరిమితం చేసారే తప్ప పనులు చేసిందేమీ లేదని విమర్శించారు. నియోజకవర్గంలో కరోనా బారినపడి ప్రజలు అల్లాడుతున్న సందర్భంలో తండ్రీ,కొడుకులు హైదరాబాదుకు పరిమితయ్యారే తప్ప 35 సంవత్సరాలపాటు గెలిపించిన ప్రజలను పట్టించుకున్న పాపానపోలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో పసుపు కుంకుమ పేరుతో మహిళలను దారుణంగా మోసంచేసిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో కుప్పం అభివృద్ధి తథ్యమన్నారు. అందులోభాగంగా కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.66 కోట్లు మంజూరు చేశారని తెలిపారు.

సమష్టిగా మహాభారత ఉత్సవాలు



వన్నెకుల క్షత్రియుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె: శ్రీద్రౌపదీ ధర్మరాజులస్వామి మహాభారత ఉత్సవాల(జాతర)ను 86 గ్రామాలకు చెందిన వన్నెకుల క్షత్రియ కులస్తులందరూ కలసికట్టుగా నిర్వహించాలని ఎమ్మెల్సీ కే.ఆర్‌జే భరత్ సూచించారు. శనివారం మండలంలోని యామగానిపల్లె శ్రీద్రౌపదీ ధర్మరాజుల ఆలయంలో గుడుపల్లె, శాంతిపురం, కుప్పం, రామకుప్పం మండలాల వన్నెకుల క్షత్రియ కుల పెద్దలతో మహా భారత ఉత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. మే నెలలో మహాభారత ఉత్సవాలు నిర్వహించాలని చర్చించి తీర్మానం చేశారు. ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్సీ భరత్ హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధి కోసం రూ.2 కోట్ల నిధులతో ప్రతి పాదనలు పంపామన్నారు. 18 రోజులు జరిగే మహాభారత మహోత్సవాలను అన్ని గ్రామాల పెద్దలు సమష్టిగా సంప్రదాయకంగా నిర్వహించాలని కోరారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

నదుం: ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి త్వరలో మండల పర్యటనకు రానున్నారని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం సంఘ మిత్రలతో సమావేశం నిర్వహించారు. మంత్రి పర్యటనను మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ ఎల్లప్ప, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, ఏపీయం హరి, సీసీలు సుజాత, రమేష్, మధు, భాను కుమార్ పాల్గొన్నారు.

సోమల మండలంలో

సోమల: మండలంలో త్వరలో జరుగనున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు కోరారు. శనివారం ఏపీఎం శివయ్య అధ్యక్షతన సంఘమిత్రలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, తహసీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ నాగరాజ, వైస్ ఎంపీపీ ప్రభాకర, వైఎస్సార్‌సీపీ నేత వరదం వెంకటరమణ పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో మంచి పోషకాలు



ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు

నదుం: చిరుధాన్యాల్లో మంచి పోషక విలువలు ఉంటాయని జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప అన్నారు. శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ చిరుధాన్యాలతో గర్భిణులు, బాలింతలు, 0-6 సంవత్సరాల పిల్లల్లో రక్తహీనతను తగ్గించవచ్చని తెలిపారు. చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా రోగ నిరోధక శక్తి లభిసుందని తద్వారా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, వైద్యాధికారి గిరీషా, ఎంఈఓ శ్రీరాములు పాల్గొన్నారు.

371 మందికి ఇళ్ల స్థలాలు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న ఇబ్రహీంఖాన్

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో 371 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను సిద్ధం చేసినట్లు సర్పంచ్ ఇబ్రహీంఖాన్ తెలిపారు. శనివారం వలంటీర్లతో ఇళ్ల స్థలాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రొంపిచెర్ల-2 సచివాలయ పరిధిలో గానుగచింత రోడ్డులోని సబ్ స్టేషన్ వద్ద 121 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. రొంపిచెర్ల-1 సచివాలయ పరిధిలో డంపింగ్ యార్డు వద్ద 250 మందికి ఇళ్ల స్థలాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈనెల 3వ తేదీన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సామాజిక పింఛన్లను పంపిణీ చేయాలని సూచించారు. మండల సచివాలయ కన్వీనర్ కరీముల్లా, కార్యదర్శులు నాగరాజ, రవిచంద్రబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డాన్స్ విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న చంద్రమోహన్ రెడ్డి

రామకుప్పం: మండలంలోని చింతకుప్పం గ్రామంలో నిర్వహించిన డ్యాన్స్ పోటీల్లో గెలుపొందిన జట్లకు శనివారం వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చంద్రమోహన్ రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో మొత్తం 40 జట్లు పాల్గొనగా, బెంగళూరుకు చెందిన స్పాన్సెర్స్ డ్యాన్స్ స్టుడియో జట్టు విజేతగా నిలిచి ట్రోఫీతోపాటు రూ.10,116 నగదు బహుమతిని గెలుచుకుంది. ద్వితీయ స్థానంలో బేట్టప్ప జట్టు నిలిచింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దినేష్, మహేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా సరిహద్దు రాళ్ల ఏర్పాటు



సర్వే రాళ్లు నాటుతున్న రెవెన్యూ సిబ్బంది



జరుగు గ్రామంలో పొలంలో నాటిన సర్వే రాయి

కుప్పంరూరల్: కుప్పం మండల పరిధిలో శనివారం నుంచి రీ సర్వే పూర్తయిన గుట్టపల్లె, జరుగు, కృష్ణదాసనపల్లె గ్రామాల్లో సరిహద్దు రాళ్ల నాటే పనులు ప్రారంభమయ్యాయి. జరుగు గ్రామంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు రెడ్డెప్పరెడ్డి, సర్వేయర్ అమితజ్, వీఆర్వో మురుగేష్ బృందం రాళ్ల పనులను ప్రారంభించింది. ఇప్పటికే ప్రత్యేకంగా తయారు చేయించిన రాళ్లను పొలాల్లో నాటుతున్నారు. రాళ్లపై 'వైఎస్సార్ జగనన్న భూరక్ష 2020' అనే అక్షరాలను ముద్రించి ఉన్నారు. రోజుకు 76 సర్వే రాళ్ల నాటాల్సి ఉండగా, మొదటి రోజు 80 రాళ్లను నాటారు. కాంట్రాక్టర్ గణపతి, రైతులు పాల్గొన్నారు.

ఏప్రిల్ ఫూల్ కాదు.. కూల్ చేద్దాం!



మొక్క నాటుతున్న రైతు చందూల్ రెడ్డి

పలమనేరు: ఏప్రిల్ నెలలో స్నేహితులను ఫూల్ చేయడం కాదని.. వేసవి నెలను కూల్ చేద్దామని మండలంలోని కూర్మాయి గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు చందూల్ రెడ్డి ఈమేరకు సాంఘిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఆమేరకు తన పొలంలో పిల్లలతో దేవకాంచనం, మోదుగ లాంటి అరుదైన మొక్కలను శనివారం నాటించారు. దీన్ని సోషల్‌మీడియాలో పెట్టడంతో ఇది బాగా వైరల్ అయి మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలపై జనాన్ని ఆలోచింపజేస్తోంది.

కురబలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



ఢిల్లీకి బయలుదేరిన కురబ నాయకులు

శాంతిపురం: కురబ కులాన్ని ఎస్టీ జాబితా చేర్చాలని ఆ కుల నాయకులు కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలంలోని ఆ కుల నాయకులు తరలివెళ్లారు. నాయకులు నల్లపరెడ్డియూరు శ్రీనివాసులు, శ్రీరాములు, గోవిందప్ప, రామ్‌కుమార్, వెంకట్రామప్ప తదితరులు శనివారం ఢిల్లీకి బయలుదేరారు. వారు మాట్లాడుతూ దేశరాజధానిలో ఈనెల 3,4 తేదీల్లో జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తమ కోర్కెలను విన్నవిస్తామన్నారు. వెనకబడిన తమ కులానికి తగు న్యాయం చేసేలా కేంద్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు.

వైఎస్సార్ బీమా పంపిణీ



నగదు అందజేస్తున్న నాయకులు

శాంతిపురం: కెనమాకులపల్లె పంచాయతీ ఎద్దులవల్లెలో అనారోగ్యంతో శనివారం మృతి చెందిన హంసగిరి(38) కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం అందించారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేలను సర్పంచ్ ఏవీ జయరాం, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనారాయణ అందించారు. మిగిలిన రూ.90 వేలు త్వరలో అందుతుందని సర్పంచ్ తెలిపారు. నాయకులు నేతప్ప, జోని రామ్మూర్తి, అప్పిరెడ్డి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



గంగవరం: ఎమ్మెల్యే అందజేసిన ప్యాడ్‌లను చూపుతున్న విద్యార్థులు



పెద్దపంజాణిలో..



పుంగనూరులో ..

పెద్దపంజాణి/గంగవరం: పెద్దపంజాణి, గంగవరం మండలాల్లో,వి.కోట మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఎస్‌వీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ వితరణగా అందజేసిన విద్యా సామగ్రిని వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని అధికమించి పరీక్షలు రాయాలని, మంచి ఫలితాలతో మండలాన్ని ఆదర్శవంతంగా నిలపాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పదేళ్లుగా ఎస్‌వీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పెద్దపంజాణి కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి, మండల కన్వీనర్ బా గారెడ్డి, సింగిల్‌విండో చైర్మెన్ ఓబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జీడీబాబు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరినాథ్, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.గంగవరం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వి.కోట మండల కేంద్రంలో పంపిణీని ఎంపీపీ యువరాజు ప్రారంభించారు. వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, సింగిల్‌విండో చైర్మన్ ధవనంభక్త, గోపిరెడ్డి, వైస్ సర్పంచ్ అక్మల్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు పట్టణంలో

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లు ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, స్కేళ్లు పంపిణీ చేశారు. శనివారం రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ డాక్టర్ జాన్ ఆధ్వర్యంలో కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి వీటిని పంపిణీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ డాక్టర్ సేవలను కొనియాడారు. హెచ్‌ఎం సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆశలన్నీ పండాలి.. ఆనందం నిండాలి



పలమనేరు: దుక్కి దున్నుతున్న రైతు

పలమనేరు వ్యవసాయ డివిజన్‌లో తొలకరి వర్షాలతో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. వర్షాధారిత పంటగా వేరుశనగ వేస్తుండగా, నీటి వసతి ఉన్న రైతులు వరి సాగు కోసం నాలుగు నెలలకే కోతకొచ్చే వరి రకాలను నారు పోస్తున్నారు. ప్రస్తుతం నారు మడులకు సిద్ధమవుతున్నారు. పల్లెల్లో సేద్యపు పనుల హడావుడి కనిపిస్తోంది. వ్యవసాయ డివిజన్‌కు సంబంధించి వేరుశగన 17 వేల హెక్టార్లలో, వరి 1100 హెక్టార్ల సాగు కావచ్చని అంచనా.

- తొలకరి వర్షాలతో రైతన్నల పొలం బాట
- భారీగా పెరగనున్న ఖరీఫ్ సాగు విస్తీర్ణం
- వరి నాట్లకు నారుమడులు సిద్ధం
- జూన్ వరకు కూలీలకు చేతినిండా పనులు

పలమనేరు : వ్యవసాయ డివిజన్ పరిధిలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వ్యవసాయ కూలీలకు ఈదఫా చేతినిండా పని దొరికినట్టే. పలమనేరు వ్యవసాయ డివిజన్‌కు సంబంధించి వేరుశనగ సాగు లక్ష్యం 16 వేల హెక్టార్లుకాగా, ఈ ఖరీఫ్‌లో 17 వేల హెక్టార్లలో సాగు కావచ్చని వ్యవసాయశాఖ అంచనా. ఈసారి సాధారణ వర్షపాతం కంటే వర్షాలు మరింత మెరుగ్గాఉంటాయని వాతావరణశాఖ తెలిపిన విషయం తెలిసిందే.

పొట్టి రకాల వరి వంగడాలు

ఖరీఫ్ వరినారు మళ్లను ముందస్తుగానే రైతులు సిద్ధం చేసుకున్నారు. సరాసరి వరి సాగు విస్తీర్ణం 1658 హెక్టార్లు కాగా, ఈ సీజన్‌లో సుమారు 1,100 హెక్టార్లకు పైగా సాగయ్యే అవకాశముందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. పొట్టి రకాల వరి విత్తనాలను రైతులు నారు పోశారు. భూగర్భ జలాలు పెరగడంతో బోర్లలో నీరు బాగా వస్తోంది.

కూలీల్లో ఆనందం

పల్లెల్లో వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో కూలీలకు చేతినిండా పనులు దొరకనున్నాయి. ప్రస్తుతం కూరగాయల పంటలు సాగు పెరగడంతో కూలీల్లోనూ ఆనందం నెలకొంది. ఈ దఫా కూలీలకు విపరీతమైన డిమాండ్ వచ్చే అవకాశాలున్నాయి. మొత్తం మీద పల్లె వాసులు వ్యవసాయపనుల్లో బిజీగా మారారు.

శ్రీవరి సాగుతో అధిక దిగుబడులు



“శ్రీవరి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. శ్రీవరి విధానంతో నాట్లు వేస్తే అధిక దిగుబడి సాధ్యం. ఈ సీజన్‌లో వరి మడులు వేసుకొనే రైతులు సంప్రదాయ పద్ధతులను పక్కనబెట్టి శ్రీవరి సాగు చేస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చు.

సంధ్య, ఏవో, పలమనేరు

అన్నీ అనుకూలిస్తున్నాయి



మూడేళ్లుగా వానలు బాగా కురుస్తున్నాయి. కోవిడ్‌తో నగరాలు, పట్టణాలనుంచి పల్లెలకు వచ్చిన వారు కూడా పొలంబాట పట్టి సేద్యం చేస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ బోర్లలో నీళ్ల పుష్కలంగా వస్తున్నాయి. దీంతో సీజన్‌తో సంబంధం లేకుండా రకరకాల పంటలు సాగవుతున్నాయి.

– మోహన్‌రెడ్డి, రైతు, చింతలగుంట

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



వి.కోట: బాలుర పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

పుంగనూరు: పట్టణంలోని 7 పాఠశాలల్లో పదో తర గతి పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు శని వారం ఏర్పాట్లు చేపట్టారు. పరీక్షల అధికారులు రుద్రాణి, చంద్రయ్య ఆధ్వర్యంలో బసవరాజ హైస్కూల్, బాలికల హైస్కూల్‌తో పాటు ఐదు సెంటర్లలో డెస్కులకు నంబర్లు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈనెల 3 నుంచి జరగనున్న పరీక్షలను పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

వి.కోట: ఈనెల మూడవ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో 6 సెంటర్లలో 1,154 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలోని జిల్లాపరిషత్ బాలుర, బాలిక పాఠశాలలు, ఇన్‌ఫాంట్, గోనుమాకులపల్లె, కుంబార్లపల్లె జిల్లా పరిషత్ పాఠశాలల్లో పది పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో తాగునీరు, డెస్కులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలీసు బందోబస్తు నడుమ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కనులపండువగా రథోత్సవం



చిత్తూరు రూరల్: పంగుణి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీ అగస్తీశ్వర స్వామి ఆలయంలో శనివారం రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. విశేష పూజల అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. రథోత్సవంలో స్వామివారిని కొలువుదీర్చి మేళతాళాలతో నగరవీధుల్లో కొలువుదీర్చారు. భక్తులు అడగడుగునా కర్పూర హారతులు, పసుపు పళ్లెంతో హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.